www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 29 ఆగస్టు 2025

అందరినీ అక్షరాస్యులుగా మార్చాలి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

గ్రామ స్థాయిలోనే అందరినీ అక్షరాస్యులు మార్చాలని ఎంపిడిఒ సురేష్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం రాయచోటి ఎంపిడిఒ సభాభవనంలో ఉల్లాస్ పథకం కింద వెలుగు, ఉపాధి హామీ చట్టం సిబ్బందికి ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణకు హాజరైన వారు తమ పరిధిలోని వయోజనులు, నిర్లక్ష్యరాస్యులకు ప్రతి 10 మందికి ఒక వాలంటీర్‌ను చొప్పన నియమించుకుని తప్పక చదువును నేర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తర్వాత పరీక్షలు నిర్వహించి అందరినీ అక్షరాస్యులుగా మార్చాల్సి ఉందని తెలిపారు. శిక్షణకు హాజరైన ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేసి నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలన్నారు. తద్వారా 70 శాతం అక్షరాస్యతను సాధించిన రాయచోటి రూరల్ మండలాన్ని వంద శాతానికి చేర్చాలంటూ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ ఆఫీసర్ సి.వి.సుబ్రమణ్యం, వెలుగు శ్రీనివాసులురెడ్డి, ఎపిఒ రమేష్‌తో పాటు పలువురు ఉపాధి హామీ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలకు పాతర వేయాలి

- సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ధర్నా చేస్తున్న సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా గత చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలు కారణంగా, ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించి, ప్రజలపై పెనుభారాలు మోపిందని, దీనికి వ్యతిరేకంగా ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం జరిగిందని, దీనికి వామపక్ష పార్టీలు ప్రధాన భూమిక పోషించాయని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు తెలిపారు. 2000 సంవత్సరం ఆగస్టు 28న హైదరాబాద్ బషీంబాద్‌లో జరిగిన విద్యుత్ వ్యతిరేక ఉద్యమంపై చంద్రబాబు ప్రభుత్వం పోలీసు కాల్పుల ధమనకాండకు పూనుకుందన్నారు. ఈ కాల్పుల్లో విష్ణువర్ధన్‌రెడ్డి, రామ కృష్ణ, బాలస్వామి అశువులు బాశారన్నారు. ఈ మారణకాండ జరిగి నేటికీ 25 సంవత్సరాలు పూర్తయిందని, ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ అమర వీరుల సంస్మరణ ప్రతిజ్ఞ దినం పాటించాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయన్నారు. గురువారం మదనపల్లె పట్టణంలో జ్యోతిబాపులే విగ్రహం వద్ద ప్రజా సంఘాల అధర్యంలో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించాయి. విద్యుత్ అమరవీరులకు పూలతో ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు కార్యక్రమానికి హాజరైన ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా ప్రపంచ బ్యాంకు ఆదేశిత సంస్కరణలనే అమలు చేస్తున్నారని, దీనిలో భాగంగానే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాష్ట్రంలోని టిడిపి జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వాలు విద్యుత్తు రంగాన్ని మొత్తం అదానీ వంటి కార్పొరేట్లకు కట్టబెడుతున్నాయని, ప్రజలపై పెను భారాలు వేస్తున్నాయని విమర్శించారు. ప్రజా పోరాటం ద్వారా ఈ సంస్కరణలకు పాతర వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2000 సంవత్సర విద్యుత్తు ఉద్యమంతో చంద్రబాబు ప్రభుత్వం ఘోరంగా ఓడిపోయిందని, తరువాత వచ్చిన ప్రభుత్వాలు 10 ఏళ్ల పాటు ప్రజలపై విద్యుత్ భారాలు వేయలేని పరిస్థితి ఏర్పడిందని, ఇది ప్రజా ఉద్యమ ఫలితమన్నారు. ప్రపంచ బ్యాంకు జీతగాడు చంద్రబాబు మోసగాడు అనే నినాదం నేటికీ కొనసాగుతోందని, చంద్రబాబుతో నేడు పవన్ కల్యాణ్, బిజెపి నేతలు జతకట్టి ప్రపంచ బ్యాంకు విధానాలను కొనసాగిస్తున్నారని విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలోనూ బయటికి చెప్పకుండా ప్రపంచ బ్యాంకు విధానాలనే విద్యుత్ రంగంలో అమలు చేశారని విమర్శించారు. విద్యుత్తు రంగం ప్రయివేటీకరణలో భాగమే అదాని ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగింపని పేర్కొన్నారు. తమకు అధికారమిస్తే స్మార్ట్ మీటర్లు, అదనపు సర్దుబాటు ఛార్జీలు రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం అవే స్మార్ట్ మీటర్లు, అవే ఛార్జీల భారం ప్రజలపై వేయడం రాష్ట్ర ప్రజలను మోసగించడమేనన్నారు. బషీరాబాద్ అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో, ఉదృత ప్రజా పోరాటం ద్వారా స్మార్ట్ మీటర్లను, విద్యుత్ భారాలను, సంస్కరణలను రద్దు చేయించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి ఎవరు అధికారంలో ఉన్నా కార్పొరేట్లకు సంపద పోగు చేయడం, సామాన్య మధ్యతరగతి ప్రజలపై పెనుభారాలు వేసే విధానాలనే అమలు చేస్తున్నారని, వీటిని రద్దు చేయించేందుకు గతంలో మాదిరిగా నేడు కూడా వామపక్ష పార్టీలు ప్రజల పక్షాన నిలిచి పోరాడుతున్నాయని, ప్రజలు వామపక్ష పార్టీలకు అండగా నిలవాలని, పోరాటాల్లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రభాకర్, నాగరాజు, సిఐటియు జిల్లా నాయకులు టి.హరిశర్మ, అంజినేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమణ, రెడ్డెప్ప, రైతు సంఘం నాయకులు నరసింహులు, విద్యార్థి సంఘం నాయకులు అఫ్రిద్, సమీర్ పాల్గొన్నారు. **కలకడ :** ప్రజలపై విద్యుత్ భారం ఆపాలని, విద్యుత్ ఛార్జీలు పెంచబోమని మోసం చేసిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మంగిరి సాంబశివ, పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్‌వెంకటేష్ తెలిపారు. స్థానిక బస్టాండ్ వద్ద నాయకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నాయకులు జలాలుద్దీన్, మున్నాబాబు, హబీబ్, సాదిక్ ఆలీ, బాబు ఖాన్, సుహేల్, ఖాదర్ వలీ, జిందేశ పాల్గొన్నారు.

ఆర్‌టిసి అభివృద్ధే లక్ష్యం

- ఆర్‌టిసి జోనల్ చైర్మన్ పూల నాగరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆర్‌టిసి అభివృద్ధే లక్ష్యమని ఎపిఎస్‌ఆర్‌టిసి జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. గురువారం ఎపిఎస్‌ఆర్‌టిసి కడప జోనల్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం ఆర్థికంగా లాభదాయకమని తెలిపారు. సూపర్‌సిక్స్‌లో భాగంగా అమలు చేసిన స్త్రీశక్తి పథకం సూపర్ హిట్ అయిందని తెలిపారు. ఈ పథకం అమలుకు సహకరించిన ఆర్‌టిసి అధికారులు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో ఆర్‌టిసి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి గోపాల్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ గజలక్ష్మి, డిప్యూటీ సిఇఒ పి.వి.రమణారెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ధనలక్ష్మి, ఇన్‌ఛార్జి విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ ధర్మతేజ, సెక్యూరిటీ ఎస్ఐ సలాం, డిప్యూటి సిటిఎం ప్రశాంతి, డిపో మేనేజరు డిల్లేస్వరరావు, అధికారులు, ఆఫీస్ సిబ్బంది, అన్ని యూనియన్ల అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పూల నాగరాజు

ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుకోవద్దు

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

బాధితులకు సిఎంఎఫ్‌ఆర్ చెక్కులను అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి/చిన్నమండెం

సామాన్య ప్రజలను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తన క్యాంప్ కార్యాలయం, బోరెడ్డిగారిపల్లెలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను మంత్రి స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించారు. బాధితులు మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు విశేష కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కొంతమంది నేతలు, ప్రజలు మంత్రికి పుష్పగుచ్ఛంతో సత్కరించి సన్మానించారు. టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో మాసాపేటలోని మాండవ్య నది మరమ్మతు, సుందరీకరణ పనులకు మంత్రి రూ.30 లక్షల నిధులతో చేపట్టే పనికి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాయచోటి మున్సిపాలిటీని నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఇందుకోసం అధికారులు అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి : పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం లాంటిదని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. రూ.71.24 లక్షల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను బాధితులకు అందజేశారు. రాయచోటి నియోజకవర్గం నుంచి 62 మంది లబ్ధిదారులకు రూ.60.24 లక్షలు, ఇద్దరు ఎల్‌ఒసి బాధితులకు రూ.11 లక్షలు చెక్కులు అందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ సుగవాసి విద్యాధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టిడిపి పట్టణ, రూరల్ అధ్యక్షులు ఖాదరవల్లి, మురికినాటి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

డిఎస్‌సి సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

ప్రజాశక్తి-కడప అర్బన్

మెగా డిఎస్‌సి-2025 సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. కడప నగరంలోని ఎస్.వి.ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ అధ్యక్షతన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమానికి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. సర్టిఫికెట్ల పరిశీలనకు ఒక్కో టీముకు 50 మంది చొప్పున 17 టీంలను ఏర్పాటు చేశారు. 30 మంది వాలంటీర్లు కూడా అందుబాటులో ఉండేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ప్రధానంగా వెరిఫికేషన్‌కు సంబంధించి విద్యా శాఖ, రెవెన్యూ అధికారులు, దాదాపుగా 68 మందితో 17 టీములతో పాటు 30 మంది వాలంటీర్లు అందుబాటులో ఉండి పరిశీలన కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. హారిజంటల్ వర్టికల్ రిజర్వేషన్ల ఆధారంగా అభ్యర్థి లాగిన్‌లోనే ఆర్డర్ కాపీలు జనరేట్ అయ్యాయి. ఆధార్ కాపీలు జనరేట్ అయినవారు మాత్రమే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరై తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకున్నారు. చివర ర్యాంకులో ఉన్నవారికి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో ఎవరైనా విఫలమైతే అవకాశం రావచ్చని ఉపాధ్యాయవర్గాల సమాచారం. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మెగా డిఎస్‌సి రాష్ట్ర అబ్జర్వర్ మధుసూధనరావు పరిశీలించారు.

ముందే వచ్చిన దసరా పండుగ : ఎమ్మెల్సీ

జిల్లాలో దసరా పండుగ ముందే వచ్చిందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం డిఎస్‌సి అభ్యర్థుల ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టారన్నారు. అభ్యర్థులు ఎటువంటి ఆందోళనకు గురికావలసిన అవసరం లేదని తెలిపారు. నోటిఫికేషన్ ఇచ్చిన ప్రకారంగా ఉద్యోగాలు భర్తీ చేస్తారన్నారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేసిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేస్తున్నట్లు చెప్పారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

హక్కుల రక్షణకు పోరాటం

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్: కురుబల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం చేద్దామని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాలులో జిల్లా కురుబ, కురుమ, కురువ సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా కురుబలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పాలకులు శ్రద్ధచూ పకపోవడం దారుణమన్నారు. అన్ని పార్టీలు కురుబలకు తగు మేర రాజకీయ ప్రాధాన్యతను కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యాయన్నారు. కురుబలందరినీ సంఘటిత పరిచి తమ హక్కుల పరిరక్షణ కోసం పోరాడేలా చూస్తామన్నారు. గ్రామ స్థాయి నుండే కురుబలను పోరాట దిశగా నడిపించేందుకు అవసరమైన కమిటీలను నియమిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయి నుండే తమ హక్కుల పరిరక్షణ కోసం పోరాటానికి సంసిద్ధులు కావాలంటూ పిలుపునిచ్చారు.

పలు కమిటీల నియామకం : కురుబ సంఘం అన్నమయ్య జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షుడుగా కె.రవిశంకర్, అధ్యక్షులుగా తరిగొండ ఈశ్వరయ్య, ఉపాధ్యక్షులుగా ఎం.గంగాధర్, గుడి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా కప్పల రాజన్న, కోశాధికారిగా గోవిందు సుధాకర్‌లను ఎన్నుకున్నారు. యువజన కమిటీ అధ్యక్షుడుగా మంగిరి సురేష్, ఉపాధ్యక్షులుగా కదిరి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా గుడిశవలను ఎన్నుకున్నారు. చిన్నమండెం మండల కమిటీ గౌరవ అధ్యక్షులుగా కదిరి చిన్నప్ప, అధ్యక్షులుగా ముక్కంటిరవి, సంబేపల్లె మండల గౌరవ అధ్యక్షులుగా నాగమల్లయ్య, అధ్యక్షులుగా బాలాజీ, రామాపురం మండల గౌరవ అధ్యక్షులుగా బి.రామాంజులు, అధ్యక్షులుగా పి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా పి.శ్రీనివాసులును ఎన్నుకున్నారు. కురుబ ఉద్యోగుల కమిటీ జిల్లా అధ్యక్షులుగా మురళికుమార్, కురుబ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా వండాడి బాబు, ప్రధాన కార్యదర్శిగా రామచంద్రను ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ షెప్పర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులుగా కె.రవిశంకర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లాలోని కురుబలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కురుబ సంఘం నూతన జిల్లా, మండల కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత ఎన్నికల సందర్భంగా రాజంపేటలో నిర్వహించిన బహిరంగ సభలో రాజంపేటను జిల్లా చేస్తామని, అన్నమయ్య ప్రాజెక్టును పునఃనిర్మిస్తామని, మెడికల్ కాలేజీ మంజూరు చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, పందికాళ్ల మణి కోరారు. గురువారం ఆర్‌అండ్‌బి అతిధి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అన్నమయ్య ప్రాజెక్ట్ కొట్టుకు పోవడం వల్ల వేలాది మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి తాగునీటికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అన్నమయ్య ప్రాజెక్ట్‌ను నిర్మించుకుంటే రానున్న రోజుల్లో పట్టణ ప్రజలు కూడా తాగునీటికి ఇబ్బందులు పడే దయనీయ పరిస్థితులు నెలకొంటాయన్నారు. అభివృద్ధి విషయానికి వస్తే రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతున్నా గత 15 ఏళ్లుగా రాజంపేటలో అభివృద్ధి అన్నది మచ్చుకైనా లేదన్నారు. రాజంపేట జిల్లా కేంద్రం అయితేనే అభివృద్ధి చెందుతుందని, జిల్లా అభివృద్ధి జరుగుతుందని ప్రజలు ఎంతో ఆశతో ఉన్నారని తెలిపారు. అందువల్ల రాజంపేట జిల్లా కేంద్రం కావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. రాజంపేట డివిజన్, పార్లమెంట్ కేంద్రం అయినందున రాజంపేటకు మెడికల్ కళాశాల మంజూరు చేయాలని తెలిపారు. రాజంపేట ప్రాంతంలో పేదరికం ఎక్కువగా ఉన్నందున మెడికల్ కళాశాల ఏర్పాటు అయితే ముఖ్యంగా ఇక్కడి పేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అభివృద్ధిలో వెనకబడి ఉన్న రాజంపేట అభివృద్ధి పథంలో ముందుకు పోవాలి అంటే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. సమావేశంలో పార్టీ శాఖ కార్యదర్శి మల్లారపు కృష్ణయ్య, ప్రసాద్ రావు, రమణయ్య, సుబ్బయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు : 'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్: విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మాజీ జడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి కడప జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి బాల, బాలికల సబ్ జూనియర్స్, మెన్, విమెన్ సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఎంపికల ముగింపు వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 40 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 29, 30, 31వ తేదీలలో ప్రకాశం జిల్లా చేవూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొను క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో కూడా తమ సత్తా చాటాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు జనసేన పార్టీ అండగా ఉంటుందని, వారు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి నందకిషోర్, ప్రధానోపాధ్యాయులు నాగమణి, గంగాధర్, బాబా ఫక్రుద్దీన్, ఇమామ్‌బాషా, సద్దాం, ముజీబ్, జనసేన నాయకులు సమ్మెట శివప్రసాద్, మౌలా, సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడాకారులతో యల్లటూరు శివరామరాజు

సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలి : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని రాజంపేట టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. గురువారం డిఆర్‌డిఎ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పనులు కల్పించాలన్నారు. వారు చేసిన పనులకు సకాలంలో బిల్లులు అందించాలన్నారు. ప్రధానంగా పార్టీలకు అతీతంగా ప్రజలకు అవసరమైన చోట పనులను కల్పించాలన్నారు. పేదలకు మంచి జరగాలని, అలా కాకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని, అవకతవకలకు పాల్పడితే మాత్రం పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో లాగా ఎలా పడితే అలా ఉపాధి హామీ చట్టాన్ని పక్కదారి పట్టించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని, అవినీతికి ప్రోత్సహించే అధికారులకు కూడా ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు. పేద ప్రజలకు మంచి చేసేందుకు ప్రవేశపెట్టిన ఈ చట్టాన్ని కొందరు పక్కదారి పట్టిస్తూ భారీగా లాభ పడుతున్నారని, అతి త్వరలోనే ఆ అవినీతిని అరికట్టి పేద ప్రజలకు మంచి చేసేలా చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రతి ప్రభుత్వ పథకాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు. గ్రామాలలో అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఉపాధి హామీ ద్వారా గ్రామాలలో చేపట్టే పనులు ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలని, కేవలం పని పెట్టాలని ఎక్కడపడితే అక్కడ పెట్టి ఉపయోగం లేని పనులు చేయడం వల్ల అటు డబ్బు ఇటు సమయం వృధా అవుతుందని పేర్కొన్నారు. అంతకుముందు నూతనంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన జగన్‌మోహన్‌రాజుకు అధికారులు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎపిడి ప్రతాప్, పిఆర్ డిఇ శ్రీనివాసులు, ఎపిఒ సాలయ్య పాల్గొన్నారు.

'మిట్స్' విద్యార్థులకు కమ్యూనికేషన్ సిస్టంపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె: మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటి బి.టెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం కమ్యూనికేషన్ సిస్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మిట్స్ పూర్వ విద్యార్థి, భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖలోని సొసైటీ ఫర్ అప్లైడ్ మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ రీసెర్చ్‌లో శాస్త్రవేత్తగా సేవలందిస్తున్న దండూరి కోటిరెడ్డి ప్రధాన వక్తగా హాజరై మాట్లాడుతూ కమ్యూనికేషన్ వ్యవస్థ అనేది ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి సమాచారాన్ని పంపడానికి ఉపయోగించే పరికరాలు, నెట్‌వర్క్‌ల సముదాయం అని, టెలికమ్యూనికేషన్, ప్రసార వ్యవస్థలు, ఉపగ్రహాలు, రిలే స్టేషన్లు, డేటా టెర్మినల్ పరికరాలు ఇవన్నీ దీని భాగమని వివరించారు. సమాచారాన్ని అర్థవంతమైన రూపంలో పంపడం, స్వీకరించడం, విశ్లేషించడం, పంచుకోవడమే దీనిఉద్దేశమన్నారు. అధునాతన సాంకేతికతలలో ప్రపంచ నాయకుడిగా ఎదగాలన్న దార్శనికతలో భాగం కావడానికి ఇది యువ ఇంజనీర్లకు గొప్ప అవకాశమన్నారు. కార్యక్రమంలో గణిత విభాగాధిపతి డాక్టర్ రమేష్‌రెడ్డి, ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ చంద్ర శేఖర్, చరణ్ పాల్గొన్నారు.

సర్వేతో మరిన్ని పెట్టుబడులు సాధ్యం

- మదనపల్లె సబ్ కలెక్టర్ కళ్యాణి

ప్రజాశక్తి-రాయచోటి

సులభతర వ్యాపారంపై భారత ప్రభుత్వం నిర్వహించే సర్వేలో సానుకూల స్పందన వల్ల రాష్ట్రానికి, జిల్లాకు మరిన్ని పెట్టుబడులు సాధ్యమని, అన్నమయ్య జిల్లాలో వ్యాపార సౌలభ్యానికి జిల్లా యంత్రాంగం చేయూతనందిస్తుందని, మదనపల్లి సబ్ కలెక్టర్ కళ్యాణి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్‌ఎస్ హాల్లో మదనపల్లి సబ్ కలెక్టర్ కళ్యాణి అధ్యక్షతన బిజినెస్ రిఫార్మ్ యాక్షన్ ప్లాన్ 2024 అవుట్ రీచ్ కార్యక్రమాన్ని జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తూ, దేశ వ్యాప్తంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో అగ్రస్థానాన్ని సాధించిందని గుర్తు చేశారు. 2016 నుండి 2020 వరకు వరుసగా మొదటి స్థానంలో నిలిచిందని, 2022లో టాప్ అచీవర్‌గా రాష్ట్రంగా గుర్తింపు పొందిందని తెలిపారు. సులభతర వ్యాపారం చేయడంలో మన రాష్ట్రం ముందంజలో ఉండడం వల్ల కేంద్ర ప్రభుత్వ సహకారం, నూతన పెట్టుబడులు నూతన సంస్థలు రాష్ట్రానికి వస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరగడం, మార్కెట్ విస్తరణ జరుగుతుందన్నారు. రాష్ట్రానికి మంచి ర్యాంకింగ్ రావాలి అంటే వ్యాపారాలు చేస్తున్నవారు మంచి అభిప్రాయాలు తెలియజేయాలన్నారు. భారత ప్రభుత్వం తరపున డిపిఐఐటి నిర్వహించే సర్వేలో సంస్కరణల ద్వారా చేయూత పొంది వ్యాపారాలు చేస్తున్న వారు సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి కె.కృష్ణకిశోర్, కెపిఎంజి ప్రతినిధి రవి తేజ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న బిఆర్‌ఎపి 2024 లో 435 సంస్కరణలు అమలులో ఉన్నాయని, వీటిలో సింగిల్ విండో వ్యవస్థ బలోపేతం, స్పాట్ అప్రూవల్స్, ఆటో రిన్యువల్స్, టెంపరరీ ఎలక్ట్రిసిటీ, సివరేజ్, ఎక్సైజ్ అనుమతులు వంటి అనేక ఆన్‌లైన్ సర్వీసులు ప్రవేశ పెట్టబడ్డాయని వివరించారు. కార్యక్రమంలో పరిశ్రమ సంఘాలు, సింగిల్ డెస్క్ యూజర్స్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రధానమంత్రి కుసుం కార్యక్రమ అమలుకు చర్యలను వేగవంతం చేయాలని జిల్లాలో చిన్న తరహా నీటిపారుదల ట్యాంకులను నింపడంలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతిలోని సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద ప్రధానమంత్రి కుసుం, చిన్న తరహా నీటిపారుదల ట్యాంకుల నిర్వహణ, భూగర్భ జలాల పెంపుదల, వికలాంగ పింఛన్లు, బాలల సంరక్షణ సంస్థల ఏర్పాట్లు, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టరేట్‌లోని విసి హాల్ నుండి కలెక్టర్ శ్రీధర్, జెసి ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ కళ్యాణి, డిఆర్‌ఒ మధుసూదన్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రధానమంత్రి కుసుం కార్యక్రమంలో సోలార్ పవర్ యూనిట్లను ఏర్పాటు చేయబోయే కంపెనీలకు గుర్తించబడిన ప్రభుత్వ, ప్రయివేటు భూములను త్వరగా అందజేయాలని దీనిపై పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలలో చిన్న తరహా నీటిపారుదల ట్యాంకుల నిర్వహణపై తగిన చర్యలు తీసుకోవాలని, బాలల సంరక్షణ సంస్థల ఏర్పాటు, దానికి సంబంధించిన కమిటీల ఏర్పాటుపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వికలాంగ పింఛనులపై సమీక్షిస్తూ వికలాంగత్వం లేకపోయినా కొంతమంది పెన్షన్లు పొందుతున్నారని, అటువంటి అనర్హులను తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్ చామకూరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సూచనల మేరకు సంబంధిత శాఖల వారు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

టిబిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

క్షయ రహిత సమాజం కోసం కృషి

ప్రజాశక్తి-వీరబల్లి

క్షయ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని, ప్రభుత్వ లక్ష్యాన్ని వంద శాతం సఫలం చేయాలని టిబి ల్యాబ్ సూపర్వైజర్ గంగన్న అన్నారు. గురువారం మండలంలోని డి.రాచపల్లి పంచాయతీ పెద్దమాదిగపల్లిలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. క్షయవ్యాధిపై ఎలాంటి భయాందోళనకు గురి కావద్దని సూచించారు. వ్యాధి లక్షణలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకుంటే మందులు ఉచితంగా ఇస్తామని తెలిపారు. అనంతరం క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేపట్టారు. కార్యక్రమం సిహెచ్ఒ సురేశ్, ఎఎన్ఎం జ్యోతి ప్రియదర్శిని, ఎన్‌హెచ్ఎ, కేశవ నారాయ నమ్మ, ఎఎన్ఎమ్ నాగరత్న, ఎనిమిహెచ్ఎ నాగయ్య, మోహన్, బాలాజీ పాల్గొన్నారు.

నేడు రామాపురం మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-రామాపురం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయం సభాభవనంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జాషువా తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో అన్ని శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష జరుగు తుందని పేర్కొన్నారు. ఆయా శాఖల మండల స్థాయి అధికారులు తమ నివేదికలతో సమావేశానికి తప్ప హాజరు కావాలని కోరారు. ఈ సమావేశానికి జడ్‌పిటిసి సభ్యుడు, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల కో-ఆప్షన్ మెంబర్, సచివాలయం కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

1న కలకడ మండల సర్వసభ్య సమావేశం

కలకడ: మండల సర్వసభ్య సమావేశాన్ని వచ్చేనెల 1వ తేదిన నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.జగదీశ్వర్ తెలిపారు. మండల కేంద్రమైన కలకడలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి శ్రీదేవికుమార్ అధ్యక్షతన మధ్యాహ్నం 2.40గంటలకు సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు అందరూ హాజరయి వాలని ఆయన పిలుపునిచ్చారు. అధికారులు ప్రగతి నివేదికలను 30న సాయంత్రం 5 గంటలలోగా ఎంపిపి కార్యాలయానికి పంపాలని తెలిపారు.

డిఎస్‌సి ఫలితాల్లో సత్తాచాటిన భార్యభర్తలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఉద్యోగాలు సాధించిన మధుకర్‌రెడ్డి, సునీత

డిఎస్‌సి-2025 ఫలితాల్లో ఎద్దులవారిపల్లి సముద్రం మండలం, పులికల్లు పంచాయతీ, బొంతలవారిపల్లికి చెందిన భార్యాభర్తలు సత్తా చాటారు. బొంతల మధుకర్‌రెడ్డి స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్) జోన్-4లో 9వ ర్యాంకు, పిజిటి(మ్యాథ్స్) 20వర్యాంకు సాధించాడు. ఆయన సతీమణి సునీత స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్) జోన్-4లో 16వ ర్యాంకు, ఎస్‌జిటిలో 267వ ర్యాంకు సాధించి సత్తాచాటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా ఎంపికైన మధుకర్‌రెడ్డి, సునీత మాట్లాడుతూ ఒక ప్రణాళిక బద్ధంగా చదివి డిఎస్‌సిలో విజయం సాధించామని తెలిపారు. తమ విజయం వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం, స్నేహితుల సహకారం ఎంతో ఉందన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చన్నారు. నిరుద్యోగ అభ్యర్థులు నిరుత్సాహపడకుండా ప్రణాళికతో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని వారు సూచించారు. భార్యాభర్తలు ఉపాధ్యాయ ఉద్యోగాలకు సాధించడం పట్ల బొంతలవారిపల్లె ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులుగా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని వారు ఆకాంక్షించారు.

జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

జర్నలిస్టుల స్థలాలను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన 239 సర్వే నెంబరులో ఆక్రమణ కొంతమంది బడాబాబులు భూ కబ్జకు యత్నిస్తున్నారని తహశీల్దార్‌కు పలువురు జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై బి.కొత్తకోట తహశీల్దార్ బావాజాన్ సంప్రదిస్తే 239 సర్వేనెంబర్ పూర్తిగా ప్రభుత్వ భూమి అని తెలిపారు. దీనిలో జర్నలిస్టులకు ఇంటిపట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు. గతంలో ఈ సర్వే నెంబరుపై కొందరు ఆక్రమణ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని, వాటిపై పూర్తిస్థాయిలో నివేదికను పొందుపరిచి ఉన్నతాధికారులకు సమర్పించినట్లు తెలిపారు.. ఉన్నతాధికారుల నుండి తగు ఉత్తర్వులు వెలువడకముందు సర్వే నెంబర్ 239, ఇతర ప్రభుత్వ భూముల్లో ఎవరైనా ఆక్రమణ ప్రవేశిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తహశీల్దార్ ఆదేశాల మేరకు గురువారం ఆర్ఐ వీరాంజనేయులు, విఆర్ఒ శ్రీరాములు ఆక్రమణకు గురైనట్లు స్థలాన్ని పరిశీలించారు.

వినాయక వేడుకల్లో అపశృతి

- విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కడప అర్బన్ : నగరంలోని బాలాజీ నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపంలో అపశృతి చోటు చేసుకుంది. విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వినాయక మండపంలో విద్యుత్ తగలడంతో రాజారెడ్డి వీధికి చెందిన చెప్పలి సూమ తేజ (పంద) అక్కడికక్కడే మృతి చెందారు. వెంటనే మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

తెలుగు మీడియం విద్యార్థులకే ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - చాపాడు : రాష్ట్రంలోని తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులకు మాత్రమే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని రచయిత బొమ్మిశెట్టి రమేష్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ న్యాయ తీర్పులలోను, ప్రభుత్వ కార్యాలయాల జీవోలను తెలుగులో మాత్రమే ఇవ్వాలన్నారు. గిడుగు వెంకట రామమూర్తి తెలుగు భాషను గ్రాంథిక భాష నుంచి వాడుక భాషకే ఉద్యమంలో కీలక పాత్ర వహించారన్నారు. గిడుగు జయంతిని ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు.

పిల్లలను ఉన్నత స్థానాలకు చేర్చాలి

ప్రజాశక్తి - కడప : పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థానాలకు చేర్చాలని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు ప్రవీణ్ కుమార్, రవితేజ అన్నారు. 'గిరిజన ప్రజలలో బాల్య వివాహాలు - చిన్న వయస్సులోనే గర్భధారణ' తదితర అంశాలపై కడప నగర దండు గిరిజనుల కాలనీ లో గురువారం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్సా పథకం 2015, అట్టడుగు బలహీన వర్గాలకు చట్టాలు, బాల్యవివాహాలను నిర్మూలించడానికి ప్రామాణిక ఆపరేటింగ్ విధానం 2025 గురించి వివరించారు.

రోడ్డుపై పారుతున్న మురుగునీరు

◆ ఇబ్బందులు పడుతున్న ప్రజలు
◆ పట్టని అధికారులు

పెద్దూర్ రోడ్డులో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలో మేజర్ పంచాయతీ గాలివీడులో మురుగునీటి కాలువల సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని నడిబొడ్డున పెద్దూర్‌కు వెళ్లే దారిలో మురికి కాలువ సమస్యతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే వర్షపు నీరు మురికికాలువల్లో చేరి మురుగు నీరంతా రోడ్డు పారుతోంది. మురుగు నీరు ఖాజామీయా టీ హోటల్ నుంచి ఆర్‌టిసి బస్టాండ్ మీదుగా పెద్దూరురోడ్డువైపు ప్రవహిస్తోంది. ఆదారిలో వెళ్లాలంటే ముక్కున వేలు వేసుకోవాల్సిందేనని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రోడ్డుపై మురు గునీరు ప్రవహిస్తుండటంతో ఆదారిలో వాహనదారులు వెళ్లాలంటే జంకుతున్నారు. అయినా తప్పని పరిస్థితుల్లో ఆదారిలో వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. వర్షం వచ్చిన ప్రతిసారి తమకు కష్టాలు తప్పవడం లేదని అంటున్నారు. ప్రజలు ఇబ్బందులు పడు తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కస్బా ప్రజలు, పెద్దూర్ రోడ్డులో నివాసం ఉన్నవారు కాలువ నీటినితొక్కుకుంటూ పోయే పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. ఇప్ప టికైనా అధికారులు ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని మురుగునీరు రోడ్డుపై రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

గడప గడపకూ చెత్త సేకరణ : డిపిఒ

ప్రజాశక్తి-కలకడ

చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఒ

గడపగడపకూ చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టాలని డిపిఒ రాధమ్మ ఆదేశించారు. మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ బాటవారిపల్లెలో ఉన్న చెత్తతో సంపద తయారుచే కేంద్రాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉన్న ప్రజలకు గడపగడపకు చెత్త సేకరణ గురించి అవగాహన కల్పించాలన్నారు. తడి చెత్త పొడి చెత్త సేకరణపై కార్యదర్శులు, హరిత రాయబారులకు సూచనలు అందించారు. మండ లంలో వర్షాభావ పరిస్థితుల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో విష జ్వరాలు అవకాశాలు ఉన్నాయని అందుకోసం పంచాయతీ కార్యదర్శులు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిం చాలన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించినట్లు తెలిపారు. ప్రతి గ్రామీణ ప్రాంతంలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. గ్రామపం దచీశీఅవగచాయతీ ఎస్‌డబ్ల్యూ పిసి షెడ్ తనిఖీలు చేసి వర్మి కంపోస్టు ఎరువుల తయారు చేయడంపై, పొడిచెత్త అమ్మకంపై పంచా యతీ కార్యదర్శులకు తగు సూచనలు, సలహాలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల డిప్యూటీ ఎంపిడిఒ ప్రతాప్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నందిని, దేవేంద్ర, పంచాయతీ కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాడవాడలా వినాయక చవితి వేడుకలు

భోజనాన్ని వడ్డిస్తున్న చేస్తున్న ఎఎస్‌పి వెంకటాద్రి

ప్రజాశక్తి-రాయచోటి

అన్నదానం గొప్పదని ఎఎస్‌పి వెంకటాద్రి పేర్కొన్నారు. పట్టణం మదనపల్లె రోడ్డు మార్గంలో ఎంఎస్‌ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుని ఆయన దర్శించుకున్నారు. కమిటీ నిర్వాహకులుతో పాటు టిడిపి నేత మడితాటి శ్రీనివాసులురెడ్డి ఎఎస్‌పిని సత్కరించి జ్ఞాపిక అందించారు. అనంతరం మడితాటి శ్రీనివాసులు రెడ్డి ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వినాయక చవితి నవరాత్రులను భక్తితో నిర్వహించుకోవడం చాలా సంతోషదాయకం అన్నారు. కుల మతాలకతీతంగా, ఐకమత్యంగా సోదరభావంతో ఎటువంటి ఘటనలకు తావులేకుండా పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అన్నదానం ఏర్పాటు చేసిన మడితాటి శ్రీని వాసులురెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు జంగం రెడ్డి,సురేష్ రెడ్డి, చరణ్‌రెడ్డి, మహమ్మద్, సోమారపు నాగార్జునచారి, రంజిత్ రాయల్, రామలింగారెడ్డి, నాని, ఖాదర్‌వలి పాల్గొన్నారు. **కలికిరి :**వినాయక చవితి వేడుకలను భక్తులు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక మండపాలను పచ్చని పందిళ్లు, పూల తోరణాలు, రంగు రంగుల విద్యుత్ కాంతులు, రంగవల్లికలతో ముస్తాబు చేశారు. ప్రతి వినాయక మండపం వద్ద ప్రలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. **బి.కొత్తకోట:** పట్టణంలోని పోకనా టివీధి శ్రీరామస్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడు నిత్య పూజలు అందుకుంటున్నాడు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ఈసారి నాలుగు రోజులుపాటు వినాయక విగ్రహాన్ని ఉంచడడంతోపాటు ప్రతిరోజు భక్తులకు అన్నదానం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఐదవ రోజు నిమజ్జనాన్ని కేరళ సాంస్కృతి కార్యక్రమాలు, కోలాటాలు, బొమ్మలాట కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. **నిమ్మనపల్లి :** మండల పరిధిలో వినాయక చవితి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. వెంకోజీగారిపల్లి, నిమ్మనపల్లిలో యువకులు, పెద్దలు, మహిళలు గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక మండపాలను పూలతో, పండ్లతో అందంగా, ఆకర్షణీయంగా అలంకరించారు. మండపాల వద్ద నిర్వాహకులు పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. ఎస్ఐ తిప్పేస్వామి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. **తంబళ్లపల్లి :** మండల కేంద్రంలో పాత కళాశాల మైదానంలో గణేష్ యూత్ సభ్యులు భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రికి సాంస్కృత కార్యక్రమాల్లో భాగంగా తోలుబొమ్మలాట నిర్వహించారు. ట్రాన్స్‌కో అధికారుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. **పీలేరు:** పీలేరు బ్రాహ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో గణేష నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వ హించినట్లు ఆ సంఘం సభ్యులు తెలిపారు. ప్రతి ఏడాదీ ఆనవాయితీగా సాగే పీలేరు బ్రాహ్మణ సామూహిక గణేష నిమజ్జన కార్యక్రమాన్ని ఈ ఏడాది మండలంలోని శివరామపురంలోని శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానం సమీపంలోని గార్గేయనది ఒడ్డున అత్యంత ఉత్సాహంగా నిమజ్జనోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణసంఘ సభ్యులు రామసుబ్రహ్మణ్యం, ప్రభాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు, మయూరినాథ్, విరూపాక్షం కాశీనాథ్, నరసింహమూర్తి పాల్గొన్నారు. **నందలూరు:** నాగిరెడ్డిపల్లి లోని పలు వినాయక మండపాల వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి సందర్శించారు. కమిటీ సభ్యులు ఆయనను శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి మహిళా మండలి అధ్యక్షురాలు పల్లె మాధవి, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, శైల కుమార్, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, బూసి రెడ్డి రాజశేఖర్ రెడ్డి, నడివీధి సుధాకర్, మధురాజు పాల్గొన్నారు.

నందలూరు : వినాయక మండపం వద్ద కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే ఆకేపాటి

దారి ఏర్పాటు కోసం ఎంపిడిఒకు వినతి

ప్రజాశక్తి-కలకడ

ఇన్‌ఛార్జి ఎంపిడిఒకు వినతిపత్రం అందిస్తున్న గ్రామ ప్రజలు

మండల కేంద్రమైన కలకడలోని ఉర్దూ జడ్‌పి హైస్కూల్‌కు దారి లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే దారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒకు గ్రామస్తులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఈ పాంశాలకు ఆదర్శ పాఠశాల పక్కగా దారి ఉన్నట్లు తెలిపారు. ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో బాలికల కోసం వసతి గృహం నిర్మించడంతో గతంలో ఉన్న దారిని పూర్తిగా మూసివేశారని అన్నారు. పాఠశాలకు దారి లేకపోవడం వల్ల విద్యార్థులు పాఠశాల సిబ్బంది ఇబ్బంది పడుతుండడంతో గమనించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, స్కూల్ కమిటీ చైర్మన్ సయ్యద్‌బాషా సిబ్బంది కలిసి ఎంపిడిఒకు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఎంపిడిఒ స్పందించి పాఠశాలకు వెళ్లేందుకు దారి ఏర్పాటు కోసం ఉన్నత అధికారులకు నివేదికలు పంపుతామని తెలిపారని చెప్పారు. కార్యక్రమంలో జాఫర్ హుస్సేన్, ఖాజా హుస్సేన్, ఇర్ఫాన్, ముబారక్‌అలీ, ఆసిఫ్, జిలాని, పాల్గొన్నారు.

పెద్దచెరువుకట్టపై వ్యర్థాలు తొలగింపు

పెద్దచెరువు కట్టపై వ్యర్థాలను తొలగిస్తున్న జెసిబి

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని గోరాన్ చెరువు పంచాయతీ గేటు వద్ద పెద్ద చెరువు కట్ట పై ఉన్న వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని గురువారం పంచాయతీ కార్యదర్శి సరోజమ్మ ఆధ్వర్యంలో జెసిపి యంత్రంలో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇల్లు నిర్మించుకుంటున్న వారు మిగిలిన వ్యర్థాలు, మట్టి తెచ్చి పెద్దచెరువు కట్టపై కుప్పలుగా వేస్తున్నారని పేర్కొన్నారు. హోటళ్లు, మాంసం దుకాణాదారులు కూడా వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని తెచ్చి ఇక్కడే వేస్తు న్నారని చెప్పారు. ఇక్కడి వ్యర్థాలతో ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందికరంగా ఉందన్నారు. చాలామార్లు ఇక్కడ చెత్త వేయకూడదని సూచించామని,యథావిధిగా చెత్త వేస్తూనే ఉన్నారని తెలిపారు. ఇక నుంచి ఎవరైనా ఈ ప్రాంతంలో వ్యర్థాలు వేస్తే వారిపై కఠిన చర్య తీసుకుంటామని, ప్రతి ఒక్క వ్యాపారస్తునికి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

31న సీమ సాహిత్యానికి 'గంగనపల్లి'

ప్రజాశక్తి - నందలూరు

ఈనెల 31న యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కడప నగరం యర్రముక్కపల్లిలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన గ్రంథాలయంలో నిర్వహించే 'నెలనెలా సీమసాహిత్యం' కార్యక్ర మంలో పాల్గొంటున్నట్లు నాగిరెడ్డిపల్లి జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో 146వ సదస్సును ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగనుందని తెలిపారు. ఇందులో 'శుభ్రజ్యోత్స్న (యద్దల గంగయ్య) జీవితం – సాహి త్యం' అనే అంశంపై తాను మాట్లాడనున్నట్లు ఆయన తెలిపారు. తాను ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. సాహితీ ప్రియులు, భాషాభిమానులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పాటూరి శ్రీనివాసులరెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న రూపానందరెడ్డి

టిడిపిలో చేరిన 'పాటూరి'

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని కెఎస్ అగ్రహారానికి చెందిన క్లాస్ వన్ కాంట్రాక్టర్ పాటూరి శ్రీనివాసులరెడ్డి తన అనుచరులతో కలిసి గురువారం తన స్వగ్రామమైన అగ్రహారంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కారూపానంద రెడ్డి, సాంస్కృతి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ అధ్యక్షతన టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి మండలంలో రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించారని, అనంతరం వైసిపిలో చేరారని అన్నారు. కూటమి ప్రభుత్వ పాలన, సిఎం చంద్రబాబు నాయకత్వంపై ఆకర్షితుడై టిడిపిలో చేరారని అన్నారు. తన అనుచరులైన చిట్వేలి, కేఎస్ అగ్రహారం ,తుమ్మకొండ గ్రామాల ఎంపిటిసిలు, ఇద్దరు సర్పంచులు, అనేక కుటుంబాలకు చెందిన కార్యకర్తలు వైసిపిని వీడి టిడిపిలో చేరారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కట్ట బాలాజీ , డైరెక్టర్ జయప్రకాష్, గూడూరు నాగరాజు, రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహ, చేతిపట్టు పెంచల్‌రెడ్డి, నరసింహులు, కరుణాకర్‌రెడ్డి, బండారు గుండయ్య, ప్రసాద్, గుంటి శేషయ్య, నరసింహ నాయుడు, శంకర్ రాజు, రవిరాజు, యానాదిరాజు, రమణయ్య, పాపయ్య, వెంకటేశు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ భూములకు హద్దులు చూపించాలి

ప్రజాశక్తి - వేంపల్లె : వేంపల్లెలోని శ్రీవృషబాచలేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూములకు హద్దులు చూపించాలని దేవస్థానం పాలక మండలి సిబ్బంది కోరారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉన్న తహశీల్దార్ హరినాథ్‌రెడ్డినికలిసి వినతి పత్రం అందజేశారు. శ్రీవృషబాచలేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి అలిరెడ్డిపల్లె గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ – 1లో 123.33 సెంట్లు, సర్వే నెంబర్ 3లో 22 సెంట్లు భూమి కొండ ప్రాంతంలో ఉందని చెప్పారు. ఆలయానికి సంబంధించి సత్రాలు కూడా ఉన్నాయన్నారు. ఎద్దుల కొండ ప్రాంతంలో ఆలయ భూమి ఆక్రమణకు గురి కాకుండా ఉండేందుకు సర్వే చేయించి హద్దులు చూపించాలని కోరారు.

ఆర్‌ఎంపి వైద్యశాలల్లో తనిఖీలు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల :పట్టణంలోని ఆర్‌ఎంపి వైద్యశాలలను గురువారం అర్బన్ వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎంపి వైద్యులు ప్రతమ చికిత్సను మాత్రమే చేయాలని సూచించారు. యాంటీబయాటిక్స్ మందులు వాడటం, సెలేను పెట్టడం వంటివి చేయరాదని అన్నారు. నిబంధనలకు మించి వైద్యం చేయరాదని, అలా చేస్తే వైద్యశాలలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఓబులేసు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పోలీసులపై యువకుడు దురుసు ప్రవర్తన

- కేసు నమోదు : సిఐ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మాట్లాడుతున్న సిఐ సత్యనారాయణ

డ్యూటీలోని పోలీసులపై ఓ యువకుడు దురుసుగా ప్రవర్తిం చడంతో కేసు నమోదు చేసినట్లు మదనపల్లి రూరల్ సర్కిల్ సిఐ సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలో వినాయకుని మండపాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారన్నారు. మొదటిరోజు పండుగను ప్రశాంతంగా ప్రజలు జరుపుకున్నారని తెలిపారు. రెండవ రోజు వినాయకుడి మండపాల వద్ద డిజెలతో అశ్లీల నృత్యాలు చేయిం చడానికి అక్కడక్కడ సన్నాహాలు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందిందని చెప్పారు. ఆ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌కు దగ్గరలోని వెంకోజిగారిపల్లెలోని శివాజీనగర్‌లో ఏర్పాటుచేసిన వినాయకుని మండపం వద్ద డిజెతో అసభ్యకర, అశ్లీల నృత్యాలకు ఏర్పాట్లు చేసుకుంటుండగా నిర్వాహకులను ఎస్ఐ తిప్పేస్వామి మధ్యాహ్నం పోలీస్ స్టేషన్ కు పిలిపించారన్నారు. అక్కడ ఎస్ఐ వారికి మం డపం ఏర్పాటుకు అనుమతులు ఇచ్చే సమయంలోనే డిజెలకు, అశ్లీల నృత్యా లకు అనుమతులు లేవని తెలిపామన్నారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. అదే సమయంలో నిర్వాహకుల వెంట వచ్చిన వెంకోజిగారిపల్లిలోని శివాజీనగర్‌కు చెందిన తుపాకుల రోహిత్ కుమార్ తాము డిజె డాన్సులు ఆడే వారికి అడ్వాన్సులు ఇచ్చామని, మండపం వద్ద వారితో డాన్సులు చేసి తీరుతామని ఎస్ఐ తోనూ, పోలీసులతోనూ తీవ్రంగా వాదించాడని అన్నారు. డాన్సులు ఆడించి తీరుతామని, మీ వల్ల అయింది చేసుకోండంటూ పోలీసులతో వాగ్వివాదానికి దిగాడని చెప్పారు. తన ప్రవర్తనను వారించిన ఎస్ఐ తిప్పేస్వామి పై, పోలీసులపైన వాడలేని భాషతో దుర్భాష లాడుతూ డ్యూటీలోని పోలీసులను పోలీస్ స్టేషన్‌లోనే లెక్కచేయకుండా ప్రవర్తిం చాడని పేర్కొన్నారు. డ్యూటీలోని పోలీసులపై యువకుడు తిరగబడిన సమా చారాన్ని అందుకున్న మదనపల్లి డిఎస్‌పి మహేంద్ర, మదనపల్లి రూరల్ సిఐ సత్యనారాయణ నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి కారణాలను విచారించారని అన్నారు. డ్యూటీలోని ఎస్ఐ తిప్పేస్వామి, పోలీసులపై పోలీస్ స్టేషన్ లోనే దురుసుగా ప్రవర్తించిన, విచక్షణ రాహితంగా దుర్భాషలాడిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసులపై దురుసుగా ప్రవర్తించే వారిపైన, చట్టాన్ని అగౌరవపరిచే వారిపైన పోలీసులు చట్ట ప్రకారమే తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజలందరూ చట్టాన్ని గౌరవించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని ప్రేమాలయంసమీపంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ముద్దనూరు మహేష్(25)అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని చిట్లూరు పంచాయతీ దళిత వాడకు చెందిన మహేష్ రాయచోటిలో పనిచేసుకుంటూ రాయచోట్ల నివాసం ఉంటున్నాడని తెలిపారు. వినాయక చవితి పండుగ గ్రామంలో వినాయక విగ్రహం ఉంచడానికి కమిటీల సభ్యుడిగా సాయంత్రం ఊరికి వచ్చి వినాయక విగ్రహం నిలబెట్టడానికి ఏర్పాట్లు చూసుకొని తిరిగి బైక్‌లో రాయచోటికి వెళుతుండగా టోల్‌గేట్ దాటుకున్న తర్వాత ప్రేమాలయం వద్ద గుర్తు తెలియవాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృదేహాన్ని లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, తల్లిదండ్రులు ఉన్నారు.

గంజాయి మొక్కలు తొలగింపు

-వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల పరిధిలోని మాచిరెడ్డి గారిపల్లె పంచాయతీ ఆరోగ్య పురం బిడికి చెందిన మూడే సుబ్బరామ నాయక్ తన ఇంటి పరిసరాలలో గంజాయి మొక్కలను పెంచుతున్నడన్నా సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, రాయచోటి డిఎస్‌పి ఎంఆర్.కృష్ణమోహన్ ఆదేశాల మేరకు రాయచోటి రూరల్ సిఐ వరప్రసాద్, ఎక్సైజ్ అధికారులతో పాటు మండల రెవెన్యూ అధికారులతో వెళ్లి మూడే సుబ్బరామనాయక్ ఇంటి పరిసరాలలో పెంచుకుంటున్న సుమారు10 గంజాయి మొక్కలను సమూలంగా తొలగించినట్లు తెలిపారు. ఆ వ్యక్తిపై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.